ప్రజాశక్తి
గురువారం 10 నవంబర్ 2022 5 అనంతపురం

పొలం చుట్టూ కంచె వేయడంతో లోపలికి వెళ్లలేక బయట నిల్చొన్న రైతు రామయ్య దంపతులు

పేద రైతుపై ప్రభుత్వ అక్కసు కొనసాగుతూనే ఉంది. తన కుటుంబం మొత్తం ఆధారపడి జీవిస్తున్న భూమిని నాసిన్ కంపెనీకి ఇవ్వను అన్నందుకు ఆ రైతును కక్షపూరితంగా ఇబ్బందులు పాలుజేస్తున్నారు. రెండు రోజులుగా పోలీసులు, రెవెన్యూ అధికారుల చేత ప్రభుత్వం ఆ కుటుంబాన్ని మొత్తం అవస్థలు పెడుతోంది. పలు పోలీసు స్టేషన్ల చుట్టూ తిప్పుతూ భయభ్రాంతులకు గురి చేస్తోంది. పొలం చుట్టూ అధికారులు అక్రమంగా ఇనుప ఫెన్సింగ్ వేసి రైతు కనీసం అందులోకి వెళ్లేందుకు కూడా వీల్లేకుండా చేశారు. సోమందేపల్లి మండలంలోని కావేటినాగసముద్రం గ్రామం పరిధిలో రామయ్య అనే రైతు తన పొలాన్ని నాసిన్ సంస్థకు ఇవ్వను అన్న పాపానికి అధికారులు పెడుతున్న కష్టాలు ఇవి. కార్పొరేట్ మెప్పుకోసం ప్రభుత్వం పేద రైతును ఇబ్బంది పెడుతున్న తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

తనకు న్యాయం చేయాలంటూ చేతులు జోడించి వేడుకుంటున్న రైతు రామయ్య

పేద రైతుపై.. ఆగని అక్కసు

◆ భూమి ఇవ్వనన్నందుకు ఇంటి చుట్టూ ఫెన్సింగ్

◆ పోలీసు జీపులో ఎక్కించుకుని రాత్రంతా చక్కర్లు

◆ బలవంతంగా భూమి లాగేసుకునే యత్నం

◆ రెండు రోజులుగా రైతు రామయ్య కుటుంబానికి నరకయాతన

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

కావేటినాగసముద్రం గ్రామానికి చెందిన రామయ్యకు ఉన్న ఏకైక జీవనాధారం 3.36 ఎకరాల వ్యవసాయ పొలం. నాసిన్ కంపెనీ ఏర్పాటు పేరుతో ఈ రైతు నుంచి భూమిని నిబంధనలకు విరుద్ధంగా అధికారులు తీసుకునే ప్రయత్నం చేస్తున్నారు. దీనిపై రైతు హైకోర్టుకు వెళ్లారు. కోర్టు రైతుకు న్యాయం చేసిన తరువాతనే భూమి తీసుకోవాలని తీర్పు ఇచ్చినా అధికారులు పట్టించుకోవడం లేదు. రెండు రోజులుగా పోలీసు, రెవెన్యూ అధికారులు మొత్తం ఆ రైతును ఇబ్బందులకు గురి చేస్తూనే ఉన్నారు. రైతు తన తోట చుట్టూ వేసుకున్న ఇనుప ఫెన్సింగ్‌ను మంగళవారం నాడు అధికారులు తొలగించారు. అడ్డుకోబోయిన పేద రైతు రామయ్య, ఆయన భార్యను రాత్రి సమయంలో పోలీసు జీపులో ఎక్కించుకుని బుధవారం తెల్లవారు జామున 3-30 గంటల వరకు ఒక్క చోట ఉంచకుండా సోమందేపల్లి, పెనుకొండ, గోరంట్ల ఇలా వివిధ పోలీసు స్టేషన్లకు మారుస్తూ చక్కర్లు కొట్టారు. కుటుంబ సభ్యులకు సైతం సమాచారం ఇవ్వకుండా వారిని ఇబ్బందులకు గురి చేశారు. రైతును పోలీసు స్టేషన్ల చుట్టూ తిప్పుతూనే అంతలోపు అతని పొలం చుట్టూ ఉన్న ఫెన్సింగ్‌ను తొలగించి, ఇంటికి ఆనుకుని ఉన్న రహదారి వరకు అధికారులు ఇనుప ఫెన్సింగ్ వేసి కనీసం దారి లేకుండా చేసేశారు. ఈ పనులు అన్నీ పూర్తయ్యాక బుధవారం తెల్లవారుజామున రామయ్యను పోలీసులు వదిలేశారు. తన పొలంలోకి వెళ్లేందుకు వీల్లేకుండా ఇంటి వద్ద పహారాను ఏర్పాటు చేశారు. అధికారులు బాధితులుగానున్న వారినే దౌర్జన్యంగా పోలీసు జీపులో తరలించి, ఇంట్లోకి జొరబడి సామాన్లు అన్నింటినీ చిందరవందరగా పడేసి భయభ్రాంతులకు గురిచేసే విధంగా వ్యవహరించడంపై తీవ్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

పోలీసుల దాడుల అనంతరం రైతు రామయ్య ఇంట్లో చెల్లాచెదరుగా పడి ఉన్న దస్తులు, వస్తువులు

పొలం, ఇంటి చుట్టూ కంచె వేయడంతో రోడ్డుపై ఉన్న రామయ్య కుటుంబ సభ్యులు

ఇంట్లోకి పోనీయ్యడం లేదు..

రామయ్య, బాధిత రైతు.

నాసిన్ సంస్థకు భూమి ఇవ్వను అన్నందుకు తనను బలవంతంగా పోలీసు జీపులో ఎక్కించుకునిపోయి, నా ఇంటి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. ఇంట్లోకి కూడా వెళ్లేందుకు వీల్లేకుండా చేశారు. పశువులు కూడా లోపలే ఉన్నాయి. వాటికి మేత వేసేందుకు కూడా వీల్లేకుండా పోలీసులు అడ్డుపడుతున్నారు. పేదలకు న్యాయం చేయాల్సిన అధికారులే ఈ రకంగా దౌర్జన్యంగా మా భూమిని లాగేసుకోవడం చాలా అన్యాయం. ఈ విషయంపై న్యాయస్థానంలోనూ ఇంకా కేసు నడుస్తోంది. అంతలోపే అధికారులు ఈ రకంగా తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. తనకు కుమారుడు, ఇద్దరు కుమార్తెలున్నారు. కటుంబానికున్న ఏకైక జీవనాధానం ఈ భూమే. దీన్ని ఈ రకంగా ప్రభుత్వమే దౌర్జనంగా లాగేసుకుంటే మా బాధ ఎవరితో చెప్పుకోవాలి.

కోర్టు మార్గదదర్శకాలనూ పట్టించుకోలేదు..

పేద రైతు రామయ్య భూమిని బలవంతంగా సేకరించవద్దని న్యాయస్థానం చెప్పింది. న్యాయస్థానం ఆయనతో మాట్లాడి, ఆయన అంగీకారంతో తీసుకోవాలని మార్గదర్శకాలు జారీ చేసింది. దాన్ని కూడా అధికారులు పట్టించుకోకుండా దౌర్జన్యంగా రెవెన్యూ, పోలీసు అధికారులు రైతు కుటుంబాన్ని ఇబ్బందులు పెడుతున్నారు. ఇది సరైంది కాదు.. 2013 భూసేకరణ చట్టం ప్రకారం భూసేకరణ చేయాలిగాని, బలవంతంగా పేద రైతుల నుంచి భూములు లాక్కోడం అన్యాయం.

పెద్దన్న,
ఎపి వ్యవసాయ కార్మికక సంఘం జిల్లా కార్యదర్శి.

కళ్యాణదుర్గం టిడిపిలో

భగ్గుమన్న విభేదాలు

◆ మండల కన్వీనర్ల ఎంపిక సమావేశంలో ఘర్షణ

◆ కూర్చీలు విసురుకున్న తమ్ముళ్లు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

కళ్యాణదుర్గం నియోజకవర్గం టిడిపిలోని గ్రూపు రాజకీయాలు మరోమారు బహిర్గతమయ్యాయి. మాజీ మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి, అనంతపురం జిల్లా టిడిపి అధ్యక్షులు కాలవ శ్రీనివాసులు సమక్షంలోనే పరస్పరం రెండు గ్రూపులు ఘర్షణకు దిగారు. దీంతో సమావేశంలో గందరగోళం నెలకొంది. నియోజకవర్గం పరిధిలోని మండల కన్వీనర్ల ఎంపిక కోసం బుధవారం నాడు అనంతపురం నగరంలోని ఒక ప్రయివేటు ఫంక్షన్ హాలులో మాజీ మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి, కాలవ శ్రీనివాసులు సమక్షంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎప్పటిలాగానే గ్రూపు రాజకీయాలు మరోమారు భగ్గుమన్నాయి. ఈ నియోజకవర్గంలో 2019 ఎన్నికల సమయంలో నుంచి గ్రూపు రాజకీయాలు నడుస్తున్నాయి. 2019 సార్వత్రిక ఎన్నికల్లో అంతకు మునుపు సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న ఉన్నం హనుమంతరాయ చౌదరిని కాదని మాదినేని ఉమామహేశ్వర నాయుడుకు టిడిపి అధిష్టానం టిక్కెట్టును ఇచ్చింది. ఆయనకు టిక్కెట్టు ఇవ్వడాన్ని ఉన్నం మద్దతుదారులు వ్యతిరేకించారు. ఈ గ్రూపు తగాదాల నడుమనే మాదినేని ఉమామహేశ్వర నాయుడు 2019 ఎన్నికల్లో ఓటమి చెందారు. ఆ తరువాత కూడా ఇద్దరి మధ్య సయోధ్య కుదరలేదు. ఎప్పుడు నియోజకవర్గ సమావేశం జరిపినా ఎవరికివారే యమునాతీరే అన్న చందంగా వేరువేరుగానే సమావేశాలు నిర్వహించడం జరుగుతోంది. పలు సందర్భాల్లో బాహాటంగానే రెండు గ్రూపులు తలపడిన సందర్భాలూ ఉన్నాయి. ఈ క్రమంలోనే మండల కన్వీనర్ల నియామకం కూడా జరగకుండా వాయిదా పడుతూ వచ్చాయి. పార్టీ జిల్లా బాధ్యులుగానున్న మాజీ మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి సమక్షంలో బుధవారం నాడు అనంతపురం నగరంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలోనైనా రెండు గ్రూపులను సమన్వయ పరచి కమిటీలు ఏర్పాటు చేయవచ్చునని పార్టీ భావించింది. అయితే ఈయన ముందు కూడా సయోధ్య కుదరలేదు. కంబదూరు మండలానికి చెందిన అమిలినేని లక్ష్మినారయణ మరొకరి మధ్య వాగ్వావాదం పెరిగి కుర్చీలతో కొట్టుకునే వరకు వెళ్లింది. ఇది తారాస్థాయికి చేరడంతో అక్కడి నుంచి మాదినేని ఉమామహేశ్వర నాయుడు వెళ్లిపోయారు. దీంతో తాత్కాలికంగా సమస్య సద్దుమణిగింది. అయితే ఈ రెండు గ్రూపుల మధ్య సయోధ్యను ఏ రకంగా తీసుకురావాలో తెలియని పరిస్థితి అధిష్టాన పెద్దల్లో నెలకొంది. ఒకవైపు పార్టీ ఇబ్బందులను ఎదుర్కొంటున్న సమయంలోనూ నేతలు విభేదాలు వీడకపోవడంతో ఏమి చేయాలో పాలుపోని పరిస్థితుల్లోకి నెట్టబడుతున్నారు. పార్టీ పెద్దలు సైతం కన్వీనర్ల ఎంపికను పూర్తి చేయకుండానే సమావేశాన్ని ముగించుకుని అక్కడి నుంచి వెళ్లిపోయారు.

జనవరి 27, 28, 29వ తేదీల్లో

అనంత బాలోత్సవాలు

విలేకరులతో మాట్లాడుతున్న బాలోత్సవ కమిటీ నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అనంత బాలోత్సవం కమిటీ ఆధ్వర్యంలో 2023 జనవరి 27,28,29వ తేదీల్లో తృతీయ అనంత బాలోత్సవం కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు అనంత బాలోత్సవం నిర్వహణ కమిటీ గౌరవాధ్యక్షులు షమీమ్ షఫీవుల్లా తెలిపారు. బుధవారం నాడు నగరంలోని క్రీసెంట్ స్కూల్ సమావేశ మందిరంలో కమిటీ సభ్యులు వి.సావిత్రి, శ్రీనివాసరావు, లింగమయ్య తదితరులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనంత బాలోత్సవం జిల్లా విద్యార్థుల హృదయాల్లో ప్రత్యేక స్థానంను సంపాదించిందన్నారు. నిత్యం చదువులు, మార్కులు వేటలో సతమతమయ్యే విద్యార్థులకు వారిలో దాగున్న సృజనాత్మకత, కళానైపుణ్యత, సామాజిక సృజన వంటివి ప్రదర్శించడానికి అనంత బాలోత్సవం చక్కటి వేదికగా నిలుస్తుందని తెలిపారు. విద్యార్థుల్లో చైతన్యం, జిజ్ఞాసను రేకెత్తించడానికి జనవరిలో తృతీయ బాలోత్సవాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 60 విభాగాలకు పోటీ ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. అకాడమిక్, కల్చరల్స్, సాంస్కృతిక, జానపద కళలు, వ్యాసరచన, వకృత్వం, చిత్రలేఖనం, ఆటలు, పాట, క్విజ్, ఎస్ఎ రైటింగ్, సైన్స్ ఎగ్జిబిషన్, వంటి పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాల్గొన్న విద్యార్థులందరికీ ప్రశంస పత్రంతో పాటు, విజేతలకు బహుమతులు, జ్ఞాపిక అందిస్తూ ఉత్తేజాన్ని నింపుతున్నట్లు తెలిపారు. మూడురోజుల పాటు నిర్వహించే పోటీల్లో విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ వేడుకలకు కవులు, మేధావులు, విద్యావంతులు కూడా హాజరై విద్యార్థులను ఉత్తేజపరస్తారని తెలిపారు. తృతీయ బాలోత్సవంను జయప్రదం చేసేందుకు అందరూ కృషి చేయాలని కోరారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పిల్లలు ఇందులో పాల్గొనేలా ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అనంత బాలోత్సవ నిర్వహణ కమిటీ సభ్యులు రాజేశ్వరి, రామాంజినమ్మ, చంద్రిక, అరుణమ్మ, సురేష్, రాము, పరమేష్, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

వేగవంతంగా నాడు-నేడు పనులు

◆ ఇసుక కొరత రాకుండా చర్యలు ◆ కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-బెళుగుప్ప, కళ్యాణదుర్గం

పాఠశాలల్లో జరుగుతున్న నాడు-నేడు పనులను మరింత వేగవంతం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆమె కళ్యాణదుర్గం, బెళుగుప్ప మండలాల్లో పర్యటించారు. బెలుగుప్ప మండలంలోని కాలువపల్లి, హనిమిరెడ్డిపల్లి గ్రామాల్లో జరుగుతున్న నాడు-నేడు పనులను పరిశీలించారు. పనులు వేగవంతం చేసేందుకు అన్ని చర్యలూ తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం పెంచాలని వెల్ఫేర్ అసిస్టెంట్, హెడ్ మాస్టర్లను ఆదేశించారు. అనంతరం హనిమిరెడ్డిపల్లిలో గ్రామ సచివాలయ భవనం, ఆర్బీకే, వెల్‌నెస్ సెంటర్ నిర్మాణాలను పరిశీలించారు. ఇంటింటికీ రేషన్ సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని సక్రమంగా చేయాలని ఆదేశించరు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో నిశాంత్ రెడ్డి, డిఎస్ఓ శోభారాణి, ఎంపీడీవో యాదవేంద్ర, తహసీల్దార్ ఈశ్వరయ్య శెట్టి, ఎంఈవో మల్లారెడ్డి, డీఈ అరుణ్ కుమార్, ఏఈ సుధాకర్ పాల్గొన్నారు.

ఇసుక కొరత తగ్గించేందుకు చర్యలు

వారం రోజుల్లోగా జిల్లాలో ఇసుక కొరత తగ్గించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. కళ్యాణదుర్గం మండలంలోని బోరంపల్లి ప్రభుత్వ భవనాల నిర్మాణాలు, మండల పరిషత్ పాఠశాల, ముదిగల్లు రోడ్డులోని అర్బన్ లేఅవుట్, ముద్దినాయనపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలనుకలెక్టర్ తనిఖీ చేశారు. బోరంపల్లిలోని ప్రభుత్వ భవనాల నిర్మాణం, హౌసింగ్ లే అవుట్‌లోని ఇళ్ల నిర్మాణాలకు ఇసుక కొరత ఉందని అధికారులు తెలిపారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ వర్షాల కారణంగా రీచ్‌ల్లో ఇసుక తవ్వుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. వారం రోజుల్లో నీటి మట్టం తగ్గి ఇసుక తవ్వకాలకు అవకాశం ఏర్పడనుందన్నారు. ఇసుక లభ్యత పెంచేందుకు మరో నాలుగు కొత్త రీచులకు పర్యావరణ అనుమతులు కోరామన్నారు. అనంతరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. ముద్దినాయన పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వసతులను పరిశీలించి చికిత్స కోసం వచ్చిన గర్భిణులు, స్థానికులతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో నిశాంత్ రెడ్డి, తహశీల్దార్ శంకరయ్య, ఎంపీడీవో బాలాజీ హరికష్ణ, పిఆర్ జేఈ కిషోర్, పిఆర్ డీఈ రాజన్న, ఎంఈవో విజయకుమారి, కళ్యాణదుర్గం మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, హౌసింగ్ డీఈ శైలజ పాల్గొన్నారు.

పాదయాత్ర నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

వంతెనలను బాగుచేయండి

సిపిఎం పాదయాత్రలో నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

వరదల వల్ల రాజీవ్ కాలనీలో దెబ్బతిన్న బ్రిడ్జిలను బాగు చేయాలని సిపిఎం నగర 1వ కమిటీ కార్యదర్శి వి.రామిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో వరద ముంపు కాలనీల్లో చేపట్టిన పాదయాత్ర బుధవారం మూడవ రోజుకు చేరుకుంది. వరదలతో దెబ్బతిన్న కాలనీలు, నష్టపోయిన ప్రజలను సిపిఎం నేతలు పలకరిస్తూ ఎదుర్కొంటున్న సమస్యలను స్వీకరించారు. రాజీవ్ కాలనీ పంచాయతీ పరిధిలోని ప్రియాంక నగర్, భగత్‌సింగ్ కాలనీలో ఉన్న బ్రిడ్జిలు పాడైపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అధికారులు, పాలకులు తక్షణమే బ్రిడ్జిలను బాగు చేయాలని కోరారు. బాధితులకు నష్ట పరిహారం చెల్లించాలన్నారు.. ప్రభుత్వం ప్రకటించిన సహాయం రూ.2 వేలు ఏ మేరకు సరిపోతాయంటూ ప్రజలు వాపోతున్నట్లు తెలిపారు. ప్రతి కుటుంబానికీ రూ.2 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నడిమి వంక చుట్టూ ఉన్న ప్రహరీ నిర్మించాలన్నారు. రామయ్య కాలనీలో వంకను కబ్జాచేసి పెద్ద ఎత్తున కాంపౌండ్ కట్టిన వారిని శిక్షించాలన్నారు. తక్షణమే అక్రమ ప్రహరీని తొలగించాలని డిమాండ్ చేశారు. మూడవ రోజు పాదయాత్ర రామయ్య కాలనీ, భగత్‌సింగ్ నగర్, ముత్యాలమ్మ కాలనీ, ప్రియాంక నగర్, బిజెపి కొట్టాలు, సత్యసాయి కాలనీ, శ్రీశ్రీ నగర్ వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో సిపిఎం రాజీవ్‌కాలనీ కన్వీనర్ డి.బాబు, ఉప సర్పంచి మసూద్, ఎంపీటీసీ డి.రమీజాబి, సిపిఎం వార్డు సభ్యులు రసూల్‌బీ, సిపిఎం నాయకులు ముస్కిన్, వెంకటనారాయణ, వలి, ప్రకాష్, డేవిడ్, దేవరాజు, మంజు, హరిప్రసాద్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ అసోషియేషన్ జిల్లా కమిటీ ఎన్నిక

అధ్యక్షులుగా ఎస్.రామునాయక్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

సంక్షేమ వసతిగృహాల అధికారుల సంఘం జిల్లా నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. స్థానిక సాంఘిక సంక్షేమ శాఖ బాలుర-4 హాస్టల్ నందు ఆ సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎస్.రామునాయక్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ కాలపరిమితి ముగియడంతో కొత్త కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులుగా ఎస్.రామునాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా పి.సురాంజనేయులు, జిల్లా కోశాధికారిగా బి.బాబు, అసోసియేట్ ప్రెసిడెంట్ కె.రామాంజులరెడ్డి, ఉపాధ్యక్షులుగా జి.జగన్నాథ్, ఎఆర్.రాజేశ్వరి, సి.నాగరాజు, వై.నాగలక్ష్మి, కె.ఆదినారాయణ, ఆర్.సంజీవరాయుడు, ఆర్గనైజింగ్ సెక్రటరీ డిటి.గురుప్రసాద్, జాయింట్ సెక్రటరీ ఆర్.వసంత, డి.నాగరాజు, టి.విజయకుమార్, పి.నాగార్జునరెడ్డి, పి.సునీత, జి.నందమోహన్‌రెడ్డి, రాష్ట్ర ఈసీ సభ్యులుగా డి.వాణిశైలజ, ఎం.కాసూనాయక్, కె.అనిత, డి.శారద, ఎన్.ఈశ్వరమ్మ, జిల్లా ఇసి సభ్యులుగా సి.ధనుంజయ, ఎస్.మమబూబ్‌బాషా, వి.సుగుణమ్మ, ఎం.ప్రశాంతలక్ష్మిలను ఎన్నుకున్నారు.

బాధితులకు బాసటగా వైఎస్ఆర్ బీమా

ప్రజాశక్తి అనంతపురం కార్పొరేషన్

బాధితులకు బాసటగా వైఎస్ఆర్ బీమా నిలుస్తోందని నగర మేయర్ మహమ్మద్ వసీం అన్నారు. నగరంలోని 37వ డివిజన్‌కు చెందిన కృష్ణభగవాన్ మృతి చెందారు. బాధిత కుటుంబానికి వైఎస్ఆర్ బీమా వర్తించడటంతో తక్షణ సాయంగా రూ.10 వేలను మేయర్ వసీం స్థానిక కార్పొరేటర్ అనిల్‌కుమార్‌రెడ్డితో కలిసి బుధవారం అందజేశారు. మిగిలిన రూ.90 వేలు త్వరలోనే అందిస్తామని వారికి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కుటుంబ పెద్ద మరణిస్తే వారి కుటుంబానికి అండగా నిలవాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైఎస్ఆర్ బీమా పథకానికి శ్రీకారం చుట్టారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సైఫుల్లా బేగ్, బీమా మిత్ర, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి లీకేజీలపై దృష్టి సారించండి

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగరంలో తాగునీటి పైపులైన్‌ల లీకేజీలపై దృష్టి సారించాలని అధికారులను నగర మేయర్ మహమ్మద్ వసీం ఆదేశించారు. బుధవారం నగరంలోని పోలీస్ పేరెడ్ గ్రౌండ్ ఎదుట తాగునీటి పైప్‌లైన్ లీకేజీ అవుతుండటంతో మేయర్ పరిశీలించారు. తక్షణమే లీకేజీని అరికట్టాలని సిబ్బందిని ఆదేశించారు. నగరంలో ఎక్కడా పైపులైన్ లీకేజీల వల్ల తాగునీరు వృథా కాకుండా చూడాలని సూచించారు. నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, ఎక్కడన్నా లికేజీలు గుర్తిస్తే వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. మేయర్ వెంట కార్పొరేటర్లు సైఫుల్లా బేగ్, అనిల్‌కుమార్ రెడ్డి, వైసీపీ నేతలు ఖాజా తదితరులు ఉన్నారు.

మాట్లాడుతున్న న్యాయమూర్తి జి.కబర్ది

జాతీయ న్యాయ సేవా దినోత్సవం

గుత్తి : జిల్లా 6వ అదనపు న్యాయస్థాన ప్రాంగణంలో జాతీయ న్యాయ దినోత్సవం బుధవారం జరిగింది. మండల న్యాయ సేవా సమితి అధ్యక్షులు, జిల్లా 6వ అదనపు న్యాయమూర్తి జి.కబర్ది అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి ఎల్.తేజోవతి, జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వి.దీప్తి, గుత్తి, తాడిపత్రి బార్ అసోసియేషన్ల అధ్యక్షులు కె.మనోహర్‌బాబు, ప్రతాప్‌రెడ్డి, ఏపీపీ సుధీర్‌రెడ్డి, ఏజీపీ తిమ్మారెడ్డి, సీనియర్ న్యాయవాదులు రమేష్‌నాథ్‌రెడ్డి, శ్రీధర్, ఎం.శ్రీనివాసులు, జడ్.సతీష్, మహేష్‌కుమార్, గంగాధర్ కుమార్, ఫక్రుబాషా, నవీన్, ఇస్మాయిల్, సుదర్శన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు కార్యాలయం ఆవరణలో జాతీయ న్యాయసేవా దినోత్సవం బుధవారం జరిగింది. మండల న్యాయ సేవా సమితి ఛైర్‌పర్సన్, జూనియర్ సివిల్ జడ్జి ఎన్.లావణ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పాల్గొన్న ప్రజలకు న్యాయ సేవల పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

సమీక్ష సమావేశం

పుట్లూరు : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఏపీవో చెన్నకేశవులు ఆధ్వర్యంలో టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్‌అసిస్టెంట్ల సమావేశం బుధవారం నిర్వహించారు. అన్ని పంచాయతీల్లోని కూలీలకు ఉపాధి పనులు కల్పించాలని సూచించారు. డ్రైలాండ్ ఆర్టికల్చర్ కింద నమోదు చేసుకున్న రైతులకు గుంతలు తీసుకొని మొక్కలు నాటించే కార్యక్రమం చేపట్టాలని, ప్రతి మొక్క బతికే విధంగా కృషి చేయాలని ఆదేశించారు.

నేడు పుట్లూరులో గడపగడపకూ..

పుట్లూరు : పుట్లూరు మండల కేంద్రంలో గురువారం నిర్వహించనున్న గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పాల్గొంటారని ఎంపీపీ రాఘవరెడ్డి తెలిపారు. మండల కన్వీనర్, జెడ్‌పిటిసి, ఎంపిటిసిలు, సర్పంచులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ప్రజాశక్తి-రాయదుర్గం

జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజలను చైతన్యవంతులను చేయాలని టిడిపి రాయదుర్గం పట్టణ అధ్యక్షుడు పసుపులేటి నాగరాజు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వం అరకొర సంక్షేమ పథకాలతో అన్నివర్గాల ప్రజలను మోసం చేస్తోందన్నారు. సిఎం జగన్ ప్రజావ్యతిరేక నిర్ణయాల వల్ల రాష్ట్రంలో అభివృద్ధి ఆగిపోయిందన్నారు. ఏ ముఖ్యమంత్రీ చేయనన్ని దుర్మార్గాలు, అన్యాయలు జగన్ చేశారని ఆరోపించారు. అన్ని వ్యవస్థలను ధ్వంసం చేసి, పాలనను అస్తవ్యస్తం చేసిన ఘనత జగన్ రెడ్డికే దక్కుతుందన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, కొత్త పరిశ్రమలు, పెట్టుబడులు రాష్ట్రానికి రావాలన్నా అది చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. రాష్ట్రంలో జగన్‌రెడ్డిని, రాయదుర్గంలో కాపు రామచంద్రారెడ్డిని గద్దె దించడానికి వార్డు కమిటీ కార్యకర్తల నుంచి నియోజకవర్గ స్థాయి నాయకుల వరకు అందరూ సమిష్టిగా కషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి ఇనాయత్ బాషా, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు వెంకటేశులు, జిల్లా అధికార ప్రతినిధి పురుషోత్తం, నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షుడు మహబూబ్ బాషా, జిల్లా మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు జమీల్ ఖాన్, జిల్లా బిసిసెల్ నాయకులు ధనార్జున, భజంత్రీ కృష్ణ, మాజీ కౌన్సిలర్ .వెంకటేశులు, తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం రూరల్ : సామాన్య ప్రజలు జీవించలేని స్థితిలో ప్రభుత్వం అన్ని రకాల ధరలను అమాంతం పెంచిందని రాయదుర్గం మండల టిడిపి కన్వీనర్ హనుమంతు ధ్వజమెత్తారు. మండల పరిధిలోని కొంతానపల్లి గ్రామంలో బుధవారం బాదుడే బాదుడు కార్యక్రమం నిర్వహించారు. సామాన్య ప్రజల నడ్డివిరిచేలా ఈ ప్రభుత్వ పాలన ఉందన్నారు. ఇంటింటా తిరిగి ప్రభుత్వ వైపల్యాలను ఎండగట్టారు. రాబోవు రోజుల్లో తెలుగుదేశం పార్టీని ఆదరించాలని కోరారు. టిడిపి నాయకులు కదరంపల్లి సోము, గిరిధర్ నాయుడు, తిమ్మారెడ్డి, హనుమంతు, పురుషోత్తం, ఓబయ్య, ప్రకాష్, మల్లికార్జున, హనుమంతు, కృష్ణ నాయక్, కృష్ణమూర్తి, చిత్తయ్య, శ్రీనివాసులు, కొల్లారప్ప, రమేష్, కొల్లారప్ప తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టిడిపి నాయకులు

పర్యావరణ పరిరక్షణే లక్ష్యం
జెడ్పీటీసీ రాధాస్వామి

మొక్కలు నాటుతున్న దృశ్యం

ప్రజాశక్తి-కుందుర్పి

పర్యావరణాన్ని పరిరక్షించడం ప్రతి ఒక్కరి లక్ష్యమని జెడ్పిటిసి రాధాస్వామి పేర్కొన్నారు. బుధవారం కుందుర్పి ఉన్నత పాఠశాలలో ప్రజా ప్రతినిధులు, అధికారులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా రాధాస్వామి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఒక మొక్కని నాటి సంరక్షిస్తే అది వృక్షమై మన అందరినీ కాపాడుతుందని పేర్కొన్నారు. ఆర్డీటీ వారు 130 మొక్కలను అందించి పాఠశాల ఆవరణం, చుట్టుపక్కల మొక్కలను నాటించడం అభినందనీయమని అన్నారు. స్కూల్ కమిటీ ఛైర్మన్, తెలుగు పండిట్ చొరవతో సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. ఒక పక్క సిమెంట్ బెంచీలు, మరో పక్క ముక్కలు నాటడంతో పాఠశాల సుందరంగా ఉందని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి మారుతీశ్వరి రామమూర్తి, ఎంపిపి కమల నాగరాజు, వైసిపి మండల కన్వీనర్ సత్యనారాయణ శాస్త్రి, ఎంపిడిఒ నారాయణస్వామి, స్కూల్ కమిటీ ఛైర్మన్ లక్ష్మణమూర్తి, ప్రధానోపాధ్యాయుడు నాగరాజు శాస్త్రి, ఆర్డీటీ సిబ్బంది, పాఠశాల స్థల దాతలు, సిమెంట్ బెంచీల దాతలు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యకాసం పుట్లూరు మండల కమిటీ ఎన్నిక

పుట్లూరు : ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం పుట్లూరు మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం వ్యవసాయ కార్మిక సంఘం రెండో మహాసభ స్థానిక బ్రహ్మం గారి గుడి ఆవరణంలో జరిగింది. ఈ కార్యక్రమానికి సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.సూరి, కార్యదర్శి ఎం.కృష్ణమూర్తి, సహాయ కార్యదర్శి విటి.రామాంజినేయులు, మండల కార్యదర్శి గుత్తా వెంకట చౌదరి హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడిగా టి.పెద్దయ్య, గౌరవాధ్యక్షులుగా విటి.రామాంజినేయులు, ఉపాధ్యక్షులుగా టి.బాలగుర్రయ్య, పూజారి కుళ్లాయప్ప, ప్రధాన కార్యదర్శిగా బి.భాస్కర్‌రెడ్డి, కోశాధికారిగా సాలవేముల సరస్వతి, సహాయ కార్యదర్శులుగా టి.నాగమునేంద్ర, సి.రాము, కాటం ఆదెప్ప, కమిటీ సభ్యులుగా రఘువీరా, ఎస్.పుల్లయ్య, ఎస్.సుధాకర్, నారాయణమ్మ, లక్ష్మీనారాయణ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. ఈ నెల 21, 22 తేదీలలో వ్యకాసం అనంతపురం జిల్లా ఏడవ మహాసభలు వజ్రకరూరు మండలంలో జరగనున్నాయని తెలిపారు. మండలం నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చి మహాసభలను జయప్రదం చేయాలని కోరారు.

రూ.10 వేలు ఆర్థికసాయం

నార్పల : కాలిన గాయాలతో అనంతపురంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నార్పల మండలం వెంకటాంపల్లి గ్రామానికి చెందిన రాములుస్వామి పూజారి హరిక్రిష్ణ కుమార్తె వైద్య చికిత్స కోసం టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఆలం నరసానాయుడు రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. బుధవారం ఆయన ఆస్పత్రికి వెళ్లి బాధితులను పరామర్శించారు. అధైర్యపడొద్దని అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాఘవనాయుడు, ప్రకాష్, జయసింహ, రామ్మోహన్, నారాయణస్వామి, మీసాల ఆదెన్న, నాగేష్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

అంతర్గత రోడ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి
ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి -అనంతపురం

అనంతపురం నగరంలో అంతర్గత రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణంపై ప్రత్యేక దృష్టిసారించినట్లు చెప్పారు. బుధవారం నగరంలోని 30వ డివిజన్‌లో కార్పొరేటర్ నరసింహులుతో కలిసి గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. సంక్షేమ పథకాలతో మూడేళ్లుగా కలిగిన లబ్ధిని ప్రతి ఇంటికీ వివరించారు. స్థానికంగా ఉన్న సమస్యలపై ఆరా తీసి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనంత మాట్లాడుతూ అనంతపురం నగరంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ప్రధాన రహదారుల రూపురేఖలను పూర్తిగా మార్చివేశామన్నారు. ఇదే తరుణంలో ఇంటర్నల్ రోడ్లపై కూడా ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. ఇప్పటికే నగరంలో 40 సచివాలయాల పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం పూర్తి చేశామన్నారు. స్థానిక సమస్యలు కూడా తమ దష్టికి వస్తున్నాయని, వాటిని సాధ్యమైనంత మేరకు పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని భవిష్యత్‌లో వేర్పాటువాదం అనే మాట రాకుండా ఉండేందుకే సిఎం జగన్‌మోహన్‌రెడ్డి వికేంద్రీకరణ నిర్ణయం తీసుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో మేయర్ మహమ్మద్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, పలువురు కార్పొరేటర్లు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

శింగనమల : మండల కేంద్రంలో గడప గడపకూ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి మూడేళ్లలో ప్రజా సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధిని వివరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో ప్రెసిడెంట్ బొమ్మన శ్రీరాంరెడ్డి, వైసిపి యువ నాయకుడు ఎర్రిస్వామిరెడ్డి, ఎంపీపీ యోగేశ్వరి, మండల కన్వీనర్ పట్నం నగేష్, వైస్ ఎంపీపీ విజయ, ఎమ్మార్వో ఈశ్వరమ్మ, ఎంపీడీవో నిర్మలా కుమారి, గొల్లారెడ్డి, డాక్టర్ శివశంకర్‌రెడ్డి, నాగవర్ధన్ రెడ్డి, కంచిరెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అనంత

సమస్యలను పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-గుత్తి

అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో ఐసిడిఎస్ సిడిపిఒ ఆగిశం నాగమణికి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు సాకే నాగరాజు, మండల కార్యదర్శి వి.నిర్మల మాట్లాడుతూ ఐసిడిఎస్ గుత్తి ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ కేంద్రాల్లో పదేళ్లుగా పనిచేస్తున్న ఎడబ్ల్యుహెచ్‌లను గుర్తించి ఏ డబ్ల్యూ డబ్ల్యూగా ఉద్యోగోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రజా ప్రతినిధుల సిఫారసులు ఉన్నవారిని, అర్హత లేనివారిని తీసుకోవడం అన్యాయన్నారు. సీనియార్టీ, అర్హతను బట్టి ఉద్యోగోన్నతి కల్పించాలన్నారు. తాత్కాలిక సూపర్వైజర్ల నియామకలను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు రాము నాయక్, గిరి తదితరులు పాల్గొన్నారు.

నేడు నవోదయ డిఎంఎల్‌టి ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం

స్థానిక గఫూర్ కాలనీలో నూతనంగా నిర్మించిన నవోదయ డిఎంఎల్‌టి ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌ను అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి గురువారం ప్రారంభించనున్నట్లు ఆ సంస్థ అధినేత డాక్టర్ కెఎస్.అబ్దుల్‌రజాక్ గఫూర్ తెలిపారు. యువతకు ఉపాధి మార్గాలను అందించే పారామెడికల్ కోర్సులకు ఆదరణ పెరిగిందన్నారు. ఈ నేపథ్యంలో నాణ్యమైన విద్యను అందించేందుకు ముందుకు వస్తున్నామని చెప్పారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు, యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యేతో పాటుగా మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు దాసరి వాసంతి, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ ఫయాజ్ హాజరవుతారని తెలియజేశారు.

పది శాతం రిజర్వేషన్ అమలు చేయించాలి

మాట్లాడుతున్న బలిజ సంఘం నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డిని కాపు మంత్రులు, ఎమ్మెల్యేలు డిమాండ్ చేస్తారో, అడుక్కుంటారో కాపు, తెలగ, బలిజ కులాల్లోని పేదలకు సుప్రీం కోర్టు చెప్పినట్లు పది శాతం రిజర్వేషన్లు వర్తింపజేయాలని రాయలసీమ బలిజ మహాసంఘం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక జిల్లా కార్యాలయంలో సంఘం జిల్లా అధ్యక్షులు పాములరాయి వెంకటేశ్వర్లు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అగ్రవర్ణాల్లో కాపు, తెలగ, బలిజ కులాలు 28 శాతం మంది ఉన్నారని గుర్తు చేశారు. గత ముఖ్య మంత్రి తెచ్చిన జీవోలను ప్రస్తుత సిఎం అమలు చేయకుండా పక్కన పెట్టారన్నారు. వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ వర్గాలకు అండగా నిలిచే పార్టీలకే వచ్చే ఎన్నికల్లో అండగా ఉంటామన్నారు. సంఘం మాజీ అధ్యక్షులు బల్లారి వెంకటరాముడు మాట్లడుతూ మాజీ, ప్రస్తుత సిఎంలు తమ వర్గాల వారిని మోసం చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో ట్రెజరర్ కోనేటి సాయిప్రసాద్, విజయకుమార్, లక్ష్మీప్రసాద్, రాఘవేంద్ర, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది సంబరాలు

నార్పల : బి.పప్పూరు ఆరోగ్య కేంద్రానికి జాతీయ నాణ్యత హామీ గుర్తింపు పురస్కారం దక్కడంతో వైద్య సిబ్బంది కేక్ కట్‌చేసి బుధవారం సంబరాలు చేసుకున్నారు. కలెక్టర్ చేతుల మీదుగా వైద్యాధికారి బి.జగదీష్ పురస్కారాన్ని మంగళవారం అందుకున్నారు. దీన్ని పురస్కరించుకుని వైద్యాధికారి డాక్టర్ జగదీష్‌ను వైద్య సిబ్బంది సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ జగదీష్ మాట్లాడుతూ.. జాతీయ నాణ్యత ప్రమాణాల కమిటీ బి.పప్పూరు ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించిందన్నారు. ఇక్కడ ఆరోగ్య కార్యక్రమాల అమలుతీరు, లేబరేటరీ, రికార్డుల నిర్వహణ, పరిశుభ్రమైన వాతావరణం, పారిశుధ్య నిర్వహణను కూడా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసిందని అన్నారు. పురస్కారం రావడానికి తమ సిబ్బంది కృషి కూడా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిహెచ్ఎన్ విజయమ్మ, సూపర్‌వైజర్లు శ్రీరాములు, సరస్వతి, హెల్త్ అసిస్టెంట్లు కిరణ్, విజయ్, శివకుమార్, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు : మండల వైద్యాధికారి డాక్టరు కళ్యాణ్‌కుమార్ కలెక్టరు చేతుల మీదుగా జాతీయ నాణ్యత హామీ గుర్తింపు పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా జెడ్పిటిసి రమాదేవి, ఎంపీపీ రామ్మూర్తిరెడ్డి, వైసిపి నాయకులు ప్రసాద్‌రెడ్డి తదితరులు డాక్టర్ కళ్యాణ్‌కుమార్‌కు అభినందనలు తెలిపారు.

ఉరవకొండ : వైద్య విధానంలో ఉత్తమ సేవలు అందించినందుకు ఉరవకొండ ప్రభుత్వ వైద్యాధికారి వి.శ్రీధర్ అవార్డు అందుకున్నారు. జాతీయ నాణ్యత ప్రమాణాల సంస్థ నిర్వహించిన సర్వేలో గత సంవత్సరం 100కి 86 శాతం నాణ్యతా ప్రమాణాలు పాటించినందుకు కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ నాగలక్ష్మి, డిఎంహెచ్ఒ విశ్వనాథయ్య, డిసిహెచ్ఎస్ కృష్ణవేణి చేతుల మీదుగా ఉత్తమ వైద్యాధికారిగా శ్రీధర్ అవార్డు అందుకున్నారు. అవార్డు రావడం బాధ్యతను మరింత పెంచిందని, ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యసేవలు అందిస్తానని శ్రీధర్ తెలియజేశారు.

నేరాలు ఘోరాలు

వేధింపులు తాళలేక కన్న కొడుకును కడతేర్చిన తల్లి

ప్రజాశక్తి-గుంతకల్లు

మద్యం మత్తుకు బానిసైన కొడుకు వేధింపులు భరించలేక ఓ తల్లి అతన్ని కడతేర్చిన సంఘటన మంగళవారం రాత్రి గుంతకల్లు పట్టణంలో చోటుచేసుకుంది. రెండవ పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పాత గుంతకల్లుకు చెందిన బేల్దారి నాగరాజు కుమారుడు కురుబ భీమేష్ (25) మద్యానికి బానిసయ్యాడు. రోజూ తాగి ఇంటికి వచ్చి డబ్బు కోసం, తనకు పెళ్లిచేయాలని తల్లిదండ్రులను వేధించేవాడు. కొడుకు వేధింపులకు తండ్రి ఇల్లు విడిచి చెన్నై వెళ్లిపోయాడు. అయినా అతడు రోజూ అతిగా మద్యం సేవించి తల్లి జయమ్మను వేధిస్తుండేవాడు. మంగళవారం రాత్రి కూడా అతిగా మద్యం సేవించి వేధించడంతో నిగ్రహం కోల్పోయిన ఆ తల్లి చిన్న కొడుకు సంగమేష్ సహాయంతో భీమేష్‌ను కత్తితో పొడిచి చంపివేశారు. అనంతరం మృతదేహాన్ని కాలువలో పడేయడానికి మోటార్ సైకిల్‌పై తీసుకెళ్తుండగా కుక్కలు అరుస్తూ వెంటబడ్డాయి. దీన్ని ఓ వ్యక్తి చూడడంతో మృతదేహాన్ని అక్కడే పడవేసి పారిపోయారు. స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రెండు వాహనాలు ఢీ

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

కళ్యాణదుర్గం రింగ్ రోడ్డు సమీపంలో బుధవారం వేకువజామున రోడ్డు ప్రమాదం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ఇటాచ్ లోడ్‌తో అనంతపురం వెళ్తున్న టస్కర్ వాహనం, అటువైపుగా టమోటా బాక్సులతో వెళ్తున్న మినీ వ్యాన్ రెండూ ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో ఆయా వాహనాల్లో వున్న డ్రైవర్లకు తీవ్ర గాయాలయ్యాయి. రెండు వాహనాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. పట్టణ సిఐ తేజోమూర్తి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్లకిరువైపులా కంపచెట్ల తొలగింపు

ప్రజాశక్తి-ఉరవకొండ

ఉరవకొండ మేజర్ పంచాయతీ పరిధిలోని కనేకల్ రహదారి నుంచి శివరామరెడ్డి కాలనీ, ప్రభుత్వ ఐటిఐ కళాశాలకు వెళ్లే రహదారిలో ఏపుగా పెరిగిన కంపచెట్లను సర్పంచి లలితమ్మ సహకారంతో వార్డు సభ్యులు వసికేరి మల్లికార్జున జెసిబి సాయంతో బుధవారం తొలగించారు. ఈ సందర్భంగా వసికేరి మల్లికార్జున మాట్లాడుతూ ప్రభుత్వ ఐటి కళాశాలకు వెళ్లే రహదారి కంపచెట్లతో నిండిపోయి విద్యార్థుల రాకపోకలకు ఇబ్బందికరంగా మారిందన్నారు. శివరామిరెడ్డి కాలనీలో రహదారిలో కంపచెట్లు పెరిగి విద్యుత్ తీగలపైకి వెళ్లడంతో తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోందన్నారు. వీటన్నింటినీ గుర్తించి కంపచెట్లను తొలగించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర నాయకులు బసవరాజు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

శింగనమల : సలకంచెరువు–కొరివిపల్లి రహదారికి ఇరువైపులా ఏపుగా పెరిగిన కంపచెట్లను వైసిపి నాయకుడు బొమ్మన శ్రీరాంరెడ్డి జెసిబి సాయంతో బుధవారం తొలగించారు. కంపచెట్లు తొలగించి ప్రమాదాలను నివారించడంతో గ్రామస్తులు శ్రీరామ్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

11న కనకదాస జయంత్యుత్సవాలు

ప్రజాశక్తి-అనంతపురం

కనకదాస జయంతి ఉత్సవాల్లో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈనెల 11వ తేది పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారత అధికారి కుష్బూ కొఠారి తెలిపారు. మందుగా గుత్తి రోడ్డులోని కనకదాస విగ్రహానికి పూలమాలలు వేసి అనంతరం కనకదాస కళ్యాణ మండపం నందు కార్యక్రమాలను నిర్వహిస్తామని చెప్పారు. రాజకీయ ప్రముఖులు, అధికారులు, కుల సంఘం నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలియజేశారు.

ప్రభుత్వ భవనాలకు గ్రహణం

ప్రజాశక్తి-కుందుర్పి

కుందుర్పి మండలం మలయనూరు ప్రంచాయతీ వడ్డేపాళ్యం గ్రామంలో ప్రభుత్వ భవన నిర్మాణ పనులకు గ్రహణం పట్టింది. రాష్ట్ర ప్రభుత్వం హెల్త్ క్లినిక్‌లు, అంగన్వాడీ భవనాల నిర్మాణ పనులు చేపట్టేందుకు నిధులు మంజూరు చేసింది. నెల రోజుల క్రితం భవన నిర్మాణం చేపట్టేందుకు పునాదులు తవ్వారు. అయితే అదే ప్రాంతంలో తమకు రెవెన్యూ అధికారులు 2013లో ఇళ్ల స్థలాలు మంజూరు చేశారని, ఇప్పుడు అక్కడ ఎలా పునాదులు తవ్వుతారని లబ్ధిదారులు ప్రశ్నించారు. ఇళ్ల నివాస పత్రాలతో బుధవారం నిరసన చేపట్టారు. తమకు న్యాయం జరిగేవరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. 2013లో వడ్డేపాళ్యం గ్రామస్తులకు ఇళ్ల పట్టాలు ఇవ్వలేదని, అవి బోగస్ పత్రాలని తహశీల్దారు షాబుద్దీన్ పేర్కొనడం గమనార్హం.

వైభవంగా గజగౌరీదేవి రథోత్సవం

ప్రజాశక్తి-ఉరవకొండ

విడపనకల్ మండల పరిధిలోని పాల్తూరు గ్రామంలో గజ గౌరీదేవి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. హోమం చేశారు. ఆలయ ధర్మకర్త దండిన శివానంద ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ధర్మకర్త దండిన శివానందకు పూలమాలలు వేసి సత్కరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ రామచంద్రయ్య పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

దండిన శివానందను సన్మానిస్తున్న దృశ్యం

కార్తీక దీపోత్సవం

రాయదుర్గం : కార్తీక మాసం సందర్భంగా బుధవారం స్థానిక భక్త మార్కండేయ స్వామి దేవాలయంలో పంచామృత అభిషేకం, రుద్రాభిషేకం, కేదారేశ్వరి వ్రతం, కుంకుమార్చన సేవలు నిర్వహించారు. సాయంకాలం గరుడ స్తంభం దీపోత్సవం, పల్లకి ఊరేగింపు సేవ జరిగింది. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంక్షేమ సేవా సంఘం అధ్యక్షులు శివప్ప, ధర్మకర్త ముకుంద, ఉప ధర్మకర్త వెంకటేశులు, ఉపాధ్యక్షులు సోమ పాండు, వెంకటేశులు హనుమంతు, సిద్ధప్ప, ఉప కోశాధికారి వెంకటరమణ, ప్రచార కార్యదర్శి గురురాఘవేంద్ర ప్రసాద్, డైరెక్టర్లు, యూత్ కమిటీ ప్రెసిడెంట్, సభ్యులు, మహిళా మండలి సభ్యులు, పద్మశాలి సంఘం సేవా భక్తులు పాల్గొన్నారు.

పెన్నఅహోబిలంలో వీరసింహారెడ్డి సినిమా షూటింగ్

ప్రజాశక్తి-ఉరవకొండ

పెన్నహోబిలయం శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం పరిసర ప్రాంతాల్లో ప్రముఖ నటుడు నందమూరి బాలకృష్ణ నటిస్తున్న వీరసింహారెడ్డి సినిమా షూటింగ్‌ను చిత్ర బృందం బుధవారం ప్రారంభించింది. సినిమా డైరెక్టర్ గోపీచంద్ మలినేని, చిత్ర బృందం శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో కె.విజయ్‌కుమార్, ఆలయ ప్రధాన అర్చకులు ద్వారకానాథ్ చార్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వీరసింహారెడ్డి చిత్ర బృందం

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE, ADONI.
I.P. 7/2019

Between:
M.Raghavendra. ...Petitioner
Vs
Allabakash and others. ...Respondants

Notice to Respondant - No. 20

P.Mabu Saheb (Patekar) S/o Not Known, S.L.V.P. Travels, Near Bheema Lodge, Guntakal, Anantapur District.

Whereas the above named Petitioner filed Insolvency petition against you and others to declare as insolvent and the petition is posted for your appearance on 30-11-2022.

You are hereby directed to appear in person or through your Advocate on 30-11-2022 at 10.30 a.m. before the above said Court to answer the said claim. Failing which the matter will be decided in your absence.

G.C.RANGANNA,
G.RAJESH,
Advocates for Petitioner.

In the Court of the Senior Civil Judge:Gooty
O.S.No.12/2014

Between:
P.Venkata Naidu ...Plaintiff
And
1.G.Narasimhulu (Died by his L.Rs)
2.Moutpalle Rajanna (Died by his L.Rs)
3.G.Rajeswari and Others ...Defendents

Notice toDefendant NO.3,4,5,6,7and8

D3: G.Rajeswari W/o Late G.Narasimhulu.
D4: G.Srikanth S/o Late G.Narasimhulu.
Both are R/at Kurmajipeta Village, Yadiki Mandal, Anantapuramu Dist.
D5: M.Lakshmi W/o Late M.Rajanna
D6: M.Hari S/o Late M.Rajanna
D7: M.Hari Krishna S/o Late M.Rajanna
D8: M.Bala Kishore Chowdary S/o Late M.Rajanna
All are R/at Rayalachervu Village, Yadiki Mandal, Anantapur Dist.,

పై నెంబరు కేసులో ప్రతివాదులయిన మీ హాజరు నిమిత్తం తేది:11-11-2022వ తేది ఉదయం 10.30 గంటలకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు ఉత్తర్వుల మేరకు)

B.Jayarami Reddy, Advocate
Gooty.

మహారాజశ్రీ అనంతపురం అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జిగారి కోర్టులో
I.A.No.277/2022 in O.S.No.98/2010

Between:
పోలా చౌడమ్మ మరియు ఇతరులు ...పిటీషనర్స్/వాదులు
మరియు
పోలా గంగా ప్రసాద్ మరియు ఇతరులు ...ప్రతివాదులు

నోటీసు

D22: పోలా రామలక్ష్మి భర్త: లేట్ పోలా రామ్‌మోహన్.
D23: పోలా శశికుమార్ తండ్రి: లేట్ పోలా రామ్‌మోహన్.
D24: పోలా స్వాతి తండ్రి: లేట్ పోలా రామ్‌మోహన్.
అందరి నివాసం గంగలకుంట గ్రామం, రాప్తాడు మం॥, అనంతపురం జిల్లా.

ఇందుమూలంగా పై తెలిపిన ప్రతివాదులు 22,23,24 మిమ్ములను 15వ ప్రతివాది లేట్ రామ్మోహన్ వారసులుగా చేర్చుటకు దాఖలు చేసిన అర్జీ విచారణ నిమిత్తం తేది:16-11-2022వ ఉదయం 10.30 గం॥లకు పై తెలిపిన కోర్టు నందు నిర్ణయించి వాయిదా వేయబడినది. మీరు ముగ్గురు ఆ దినం కోర్టునందు హాజరై విచారణలో పాల్గొనవలెనని కోర్టువారు ఆదేశాను ప్రకారం ఈ సమను జారీ నోటీసు దినపత్రిక మూలంగా తెలుపడమైనది. మీరు హాజరుకాని పక్షమున మీ పరోక్షమున తీర్మానమగునని తెల్పడమైనది.

(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

ఎన్.సి. సంపత్‌కుమార్, అడ్వకేట్,
అనంతపురం, సెల్: 9440780991.

In the Court of the Hon'ble IIIrd Addl.Junior Civil Judge (Excise Court) Ananthapuramu
E.P.No.61/2021 in O.S.No.517/2017

Between:
Akula Raja Babu ...Petitioners/D.Hr
V/s
M.Venkataramudu ...Respondent/J.Dr

Notice to J.Dr

To,
M.Venkataramudu S/o Late M.Babu, Running Barbar Shop, Epperu Village, Kuderu Mandal, Anantapuramu District.

పై నెంబరు ఇ.పి.లో జె.డిఆర్.అయిన మీ హాజరు నిమిత్తం తేది:15-12-2022వ తేది ఉదయం 10.30 గంటలకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు ఉత్తర్వుల మేరకు)

బండారు విశ్వనాథ్, డి.హెచ్.ఆర్. పరం వకీలు
అనంతపురం, సెల్:9441012298.

In the Court of the Hon'ble IIIrd Addl.Junior Civil Judge (Excise Court) Ananthapuramu
O.S.No.337/2020

Between:
P.Sreenivasulu ...Plaintiff
V/s
K.Nagappa ...Defendent

Notice to Defendent

To,
K.Nagappa S/o Late K.Venkatappa, D.No. 6-6-2, Satyadeva Nagar, Anantapuramu City.

పై నెంబరు కేసులో ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తం తేది:14-11-2022వ తేది ఉదయం 10.30 గంటలకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు ఉత్తర్వుల మేరకు)

ఎన్.యు.దేవనాథ్‌రెడ్డి, వాదిపరం వకీలు
అనంతపురం.